
సాక్షి
మంచిర్యాల

శుక్రవారం । 2 । జూన్ । 2023



'కవ్వాల్'లో అడవి కుక్కల బెడద

కవ్వాల్ అభయారణ్యంలో అడవి కుక్కల సంఖ్య పెరిగింది. పులినైనా ఎదురించే సత్తా ఉండడంతో అడవిలోకి వచ్చేందుకు బెబ్బులి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. 8లో▸

జాప్యం లేకుండా ధాన్యం తరలింపు

బెల్లంపల్లిరూరల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఆకెనపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. లారీల కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. చంద్రవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
42.0 /28.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆవిర్భావ వేడుకలకు సిద్ధం



విద్యుత్ దీపాల వెలుతురులో కలెక్టరేట్

మంచిర్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్‌ను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలు, జెండాలు, పూలదండలతో అలంకరించారు. కలెక్టరేట్‌తోపాటు అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాలను ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు బైపాస్‌రోడ్డులోని అమరవీరుల స్తూపం వద్ద పూలమాల సమర్పణ, నివాళులు అర్పించడం, ఉదయం 8.40గంటలకు బైపాస్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల సమర్పణ, కలెక్టరేట్ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, ప్రభుత్వ విప్ సందేశం, గౌరవ వందనం స్వీకరణ, తేనేటి విందు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

20 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు

తెలంగాణ రాష్ట్రం అవతరించి తొమ్మిదేళ్లు పూర్తయి పదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లాలో సాధించిన ప్రగతి, అభివృద్ధిపై 20 రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు ఈ నెల 2 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు పండుగల నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు.

తెరుచుకున్న సర్కారు బడులు



మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో వేసవి సెలవులు 41 రోజుల అనంతరం గురువారం సర్కారు బడులు తెరుచుకున్నాయి. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బడిబాట పట్టారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులను శుభ్రం చేయించారు. కొన్ని పాఠశాలల్లో ఎస్‌ఎంసీ సమావేశాలు నిర్వహించి బడిబాట, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై చర్చించారు. ఈ నెల 3నుంచి ప్రారంభమయ్యే బడిబాటలో భాగంగా ఏయే ప్రాంతాల్లో ఎవరెవరు టీచర్లు వెళ్లాలో పని విభజన చేశారు. ఆయా పాఠశాలల్లో సగం మంది టీచర్లు బడికి రావడంతో సందడి నెలకొంది.

బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న ముఖేశ్‌గౌడ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని రంగంపేట మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా సాధన చేయాలన్నారు. సీఎం కప్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమెన్స్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన శ్రీవల్లిని, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న స్థిత ప్రజ్ఞరెడ్డి, మాస్టర్స్ 75 ప్లస్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన పళ్లెం రాజలింగంను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ మధు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు కృష్ణ, పెట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లం శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి రాజయ్య, కోచ్ నాగేంద్ర, రవి పాల్గొన్నారు.

స్వరాష్ట్రం సాధికారత !

- గత తొమ్మిదేళ్లలో మొదలైన మార్పులు
- జిల్లాలో ఇంకా మెరుగుపడాల్సిన వృద్ధి
- నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఆసరా ఫించన్లు	99,408
మహిళా సంఘాలు	10,158
ఉపాధి జాబ్‌కార్డులు	1,20,596
ఆహార భద్రత కార్డులు	2,19,453
జనాభా : 8,07,037 (2011 ప్రకారం)	
అక్షరాస్యత	64.35శాతం

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తయి నేడు పదేళ్లలోకి అడుగు పెడుతోంది. గత తొమ్మిదేళ్ల స్వయం పాలనలో జిల్లాలో అభివృద్ధి మార్పులకు నాంది పలికింది. ఉమ్మడి రాష్ట్రంలో నెరవేరని అనేక హామీలు అమలుకు నోచుకున్నాయి. జిల్లా, మండలాలు, మున్సిపాలిటీలు, మౌలిక వసతుల కల్పన, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నుంచి 'తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది' ఉత్సవాలు మొదలై, 21రోజులపాటు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కొట్లాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ఇంకా అనేక వృద్ధి జరగాల్సి ఉంది. – సాక్షి ప్రతినిధి, మంచిర్యాల



నూతన కలెక్టరేట్

రైతులు, వ్యవసాయం

జిల్లాలో రైతుబంధు పథకంతో 1.41లక్షల మందికి రూ.156.79కోట్లు ఖాతాల్లో జమ అయ్యాయి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద మరో 60వేల రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరింది. రైతుబీమా కింద గత ఆర్థిక సంవత్సంలోనే 150మంది బాధిత రైతు కుటుంబాలకు రూ.7.50కోట్ల పరిహారం చెల్లించారు. దళితబంధు కింద నాలుగు నియోజకవర్గాల్లో 313మంది లబ్ధిదారులకు రూ.3.09కోట్లు ఖాతాల్లో జమ చేశారు. భూమి లేని 128 కుటుంబాలకు 371.05 ఎకరాలు అందజేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు 2,616 మంజూరు కాగా, 1,046ఇళ్లు పూర్తయ్యాయి. ఐదు మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో మద్దతు ధరలతో పంటలు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో తొమ్మిదేళ్లలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. ఆయిల్‌పాం వంటి కొత్త పంటలు సాగవుతున్నాయి. ఈ ఏడాది ఆయిల్ పాం 2,442ఎకరాల సాగు లక్ష్యం ఉంది. గత వానాకాలంలో 1.48లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది.

గొర్రెల పంపిణీ



లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ(ఫైల్)

గొర్రెల పంపిణీ రెండు విడతల్లో 11,619 యూనిట్లు అందజేశారు. గత ఐదేళ్లలో కొత్తగా 5.59 లక్షల గొర్రెల పిల్లల ఉత్పత్తి జరిగింది. ఉచిత చేపపిల్లల పంపిణీతో 6,538 మత్స్యకార సంఘ సభ్యులకు మేలు జరుగుతోంది. ఈ ఏడాది 1.21కోట్ల చేప పిల్లలు అందజేశారు. టీఎస్ ఐపాస్ కింద 39పరిశ్రల ఏర్పాటుకు అనుమతులు పొందారు. టీఐడియా పథకం కింద రూ.7కోట్ల సబ్సిడీ మంజూరైంది. బెల్లంపల్లిలో ఆహార శుద్ధి పరిశ్రమ ఏర్పాటైంది.

హరితహారం, పచ్చదనం



జిల్లాలో 1.76లక్షల హెక్టార్ల విస్తీర్ణం ఉంది. జిల్లా విస్తీర్ణంలో 44శాతం అడవులు ఉన్నాయి. గత హరితహారంలో తొమ్మిది విడతల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి జరుగుతోంది. ఈ ఏడాది 44.30లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా ఉంది. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు 16మండలాల్లో 548 గుర్తించి, 487మంజూరయ్యాయి. 16 మండలాల్లో పల్లె ప్రకృతి వనాల్లో 52పూర్తయ్యాయి. బృహత్ పల్లె ప్రకృతి వనాలు 80లో 52మంజూరయ్యాయి.

పోడు పట్టాల పంపిణీ



పోడు దరఖాస్తుల పరిశీలన(ఫైల్)

ఉమ్మడి రాష్ట్రంలో పోడు పంపిణీ మొదలు కాగా, స్వరాష్ట్రంలో తొమ్మిదేళ్లకు పట్టాలు అందనున్నాయి. జిల్లాలో 11,938దరఖాస్తులు రాగా, ఇందులో1847మందిని అర్హులను గుర్తించి, వీరికి 3,821ఎకరాల భూమి పట్టా ఇవ్వనున్నారు.

విద్యారంగం



లక్సెట్టిపేట: చందారం బడిలో బెంచీలు(ఫైల్)

జిల్లాలో మొత్తం 1049స్కూళ్లు ఉండగా, 1,15,130 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదు మోడల్ స్కూళ్లు, 18కేజీబీవీలు ఉన్నాయి. మన ఊరు–మన బడి కార్యక్రమంలో 248 స్కూళ్లలో అన్ని సౌకర్యాల కల్పన కోసం ప్రణాళికలు వేసి పనులు మొదలయ్యాయి. పది ప్రభుత్వ, 4బీసీ, 9సోషల్ వెల్ఫేర్, ఒకటి టీఎస్‌ఆర్‌జేసీ, మూడు మైనార్టీ, 9కేజీబీవీ, ఐదు మోడల్ కాలేజీలు ఉన్నాయి. మొత్తం 62కాలేజీల్లో 14,445మంది విద్యార్థులు ఉన్నారు.

వైద్యరంగం



మెడికల్‌కాలేజీ

జిల్లాలో గ్రామాల్లో 121 ఉప కేంద్రాలు, 17పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రి ఉన్నాయి. పట్టణాల్లో రెండు ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఉపకేంద్రాలు ఉన్నాయి. కంటి వెలుగుతో 3,24,893 మందికి పరీక్షలు చేశారు. అమ్మ ఒడి, 108 వాహనాలు, ఆశా కార్యక్రమంతో సేవలు అందిస్తున్నారు. జిల్లా ఆసుపత్రి, బెల్లంపల్లిలో డయాలసిస్ సేవలు కొనసాగుతున్నాయి. రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్రంలో కోవిడ్ చికిత్స ప్రత్యేక విభాగం ఉంది. 2019నుంచి మొదలైన కేసీఆర్ కిట్ పది వేల ప్రసవాల్లో అర్హులైన నాలుగు వేలకు పైగా అందజేశారు. నాలుగు విడతల్లో నగదు జమ చేశారు. కొత్తగా మెడికల్ కాలేజీ రాకతో ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ మొదటి సంవత్సర తరగతులు ప్రారంభమయ్యాయి. నర్సింగ్ కాలేజీ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం తాత్కాలికంగా మార్కెట్ యార్డులో కొనసాగుతుండగా, శాశ్వత భవనం కోసం గుడిపేట కోసం స్థలం కేటాయించారు. జిల్లాలో 89 ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేవు. గర్భిణులకు సకాలంలో డబ్బులు జమ కావడం లేదు. వైద్యుల కొరత, మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణంలో జాప్యం జరుగుతున్నాయి.

మహిళా, శిశు సంరక్షణ



జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రి

జిల్లాలో 18మండలాల్లో 896అంగన్‌వాడీలు, 73మినీ అంగన్‌వాడీలు ఉన్నాయి. ప్రీస్కూల్ కింద 1.30లక్షల మంది నమోదయ్యారు. ఆరోగ్యలక్ష్మీ, పోషణ్ అభియాన్ కింద గర్భిణులు, బాలింతలకు పోషణ అందుతోంది. సఖీ కేంద్రం, వివాహ ప్రోత్సాహం, సమగ్ర బాలల పథకంతోనూ 18ఏళ్లలోపు 2132మంది బాల కార్మికులను గుర్తించి సంరక్షణ కల్పిస్తున్నారు.

ఇంటింటికీ తాగునీరు..



తాగునీరు మిషన్ భగీరథతో మొత్తం 670ఆవాసాల్లో, మంచిర్యాల పరిధిలో 330ఆవాసాలకు గాను 320, ఖానాపూర్ పరిధిలోని జన్నారం 73 ఆవాసాలకు, కుమురంభీం ప్రాజెక్టు నుంచి బెల్లంపల్లి పరిధిలో 266ఆవాసాలకు నీరందుతోంది. మిషన్‌కాకతీయ కింద 223చెరువుల పునరుద్ధరణ, పది చెక్‌డ్యాం నిర్మాణం జరుగుతున్నాయి. ఇప్పటికీ చాలా ఇళ్లకు రోజువారీగా నీరందడం లేదని క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు ఉన్నాయి.

నెరవేరని హామీలు

నీళ్లు, నిధులు, నియామకాల్లో ఇంకా జిల్లాలో వెనకబడే ఉంది. ఈ ప్రాంతంలో సాగునీరు రైతన్నలకు అందని ద్రాక్షగానే మారింది. తలాపున గోదావరి, పక్కన ప్రాణహితతోపాటు అనేక సహజసిద్ధ వాగులు, వంకలు ఉన్నాయి. ఆయకట్టు రైతులకు స్వరాష్ట్రంలో సాగు నీటి గోస తీరడం లేదు. కడెం కాలువ కింద, గూడెం ఎత్తిపోతలు, గొల్లవాగు, నీల్వాయి తదితర ప్రాజెక్టుల కింద పూర్తి స్థాయి నీరందడం లేదు. బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో వర్షాధారంగానే సాగుతోంది. సింగరేణి కార్మికులకు ఇక్కడి యువతకు మేలు చేసేలా గతంలో చెప్పినట్లు కొత్త భూగర్భ గనులు రాకపోగా, ఉన్నవాటిని ఓసీపీలు చేయడంతో, కోల్ బ్లాక్‌ల ప్రైవేటీకరణ స్థానికంగా ఉపాధిపై పెద్ద దెబ్బ తగిలింది. స్థానికులకు ఉపాధి కల్పించేలా కొత్త పరిశ్రమలు రావడం లేదు. జిల్లా కేంద్రంలో అభివృద్ధి స్పష్టమైన ప్రణాళికలోపంతో రోడ్ల విస్తరణ, మాతాశిశు సంరక్షణ భవనం తదితర ఇబ్బందులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఇంకా అసౌకర్యాల కొరత ఉంది. ధరణి పోర్టల్‌తో పెరుగుతున్న భూ సమస్యలు ఇబ్బందికరంగా మారాయి.

అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

- దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన చేసిన అభివృద్ధిని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించాలని, దశాబ్ది ఉత్సవ కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో స్థాయీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 22వరకు వివిధ రకాల అంశాల్లో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ ధాన్యాన్ని రైతులు కల్లాల వద్దనే రోజుల తరబడి ఉంచినా అధికారులు కొనుగోలు చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా సకాలంలో ధాన్యం కొనకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. మిషన్ భగీరథ, అటవీశాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించారు. జెడ్పీ సమావేశం మే 5న నిర్వహించగా, కోరం లేక వాయిదాపడిందని, తిరిగి నిర్వహించాల్సి ఉన్నా ఎందుకు నిర్వహించడం లేదని అన్నారు. గిరిజనులు తలమల నుంచి ర్యాలీగడ్‌పూర్‌కు వెళ్లి పత్తి ఏరే కూలీ పనులను చేసుకోవాలనుకున్నా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. జన్నారం జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యక్రమాలపై స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. జెడ్పీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లోనూ తమను భాగస్వామ్యం చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఏడు స్థాయీ కమిటీ సమావేశాలకు గాను సాంఘిక సంక్షేమ శాఖ స్థాయీ కమిటీ సమావేశం కోరం లేక వాయిదా పడింది.

చెన్నూర్ మీదుగా జగ్దల్‌పూర్ బస్సు ప్రారంభం

చెన్నూర్: చెన్నూర్ మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌కు ఆర్టీసీ బస్సు గురువారం నుంచి ప్రారంభమైందని కరీంనగర్ డిపో మేనేజర్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు కరీంనగర్ –2 డిపో ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి చెన్నూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. అక్కడి నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరుతుందని తెలిపారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు జగ్దల్‌పూర్ నుంచి బస్సు తిరిగి వస్తుందని పేర్కొన్నారు. బస్సు ప్రారంభంతో ఇటు తెలంగాణ, మహారాష్ట్రతోపాటు ఛత్తీస్‌గఢ్‌కు రవాణా సౌకర్యం మెరుగవుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైనట్లు జిల్లా కేంద్రంలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి తెలిపారు. కళాశాలలో సీట్లు పొందిన బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ విద్యార్థులు జూన్ 2న, బీకాం జనరల్ విద్యార్థులు జూన్ 3న హాజరు కావాలని తెలిపారు. పదో తరగతి మెమో, ఇంటర్ హాల్‌టికెట్, ఇంటర్ మెమో, బోనఫైడ్ సర్టిఫికేట్లు, ఆధార్‌కార్డు, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, టీజీయూజీసెట్ హాల్‌టికెట్, అలాట్‌మెంట్ కార్డు, ఐదు ఫొటోలతో కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న శేజల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరిజిన్ డెయిరీ భాగస్వామి శేజల్ నిరసన, ధర్నా కొనసాగిస్తున్నారు. న్యూఢిల్లీ కేంద్రంగా గత మూడు రోజుల నుంచి ఆమె వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఇండియా గేట్ ఎర్రకోట వద్ద ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్త కథనాలతో ముద్రించిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. లైంగికంగా, మానసికంగా ఎమ్మెల్యే తనను వేధించారని, ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికే సమీకృత కలెక్టరేట్



సమీకృత కలెక్టరేట్ భవనాన్ని సందర్శిస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ సంతోష్, అధికారులు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

నస్పూర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఏర్పాటు చేస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. గురువారం ఆయన నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ట్రెయినీ కలెక్టర్ గౌతమితో కలిసి సందర్శించారు. జిల్లా శాఖల కార్యాలయాలు, దరఖాస్తుదారులు వేచి ఉండే ప్రాంతాలు, భవన ప్రాంగణం, గార్డెనింగ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమీకృత భవన నిర్మాణాలు చేపట్టిందని తెలిపారు. ఈ నెల 9న కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ రానున్నారని, జిల్లా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం, బహిరంగ సభ స్థలం పరిశీలన

ఈ నెల 9న సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్, స్థానిక ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, నస్పూర్‌లో బహిరంగ సభా స్థలాన్ని పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా భద్రత చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- అధికారులతో సమీక్ష సమావేశం

నస్పూర్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం ఆయన నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు వేణు, శ్యామలాదేవి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ.ప్రేమ్‌కుమార్, తహసీల్దార్లతో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, ఇళ్ల పట్టాల పంపిణీ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా ధాన్యం దెబ్బతినకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలని అన్నారు. గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యాన్ని వెంటనే లారీల నుంచి అన్‌లోడ్ చేసుకుని తిరిగి పంపించాలని అన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యాక్రమంలో భాగంగా జూన్ 2, 3వ తేదీల్లో దరఖాస్తులు స్వీకరించి 4, 5వ తేదీల్లో పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేసుకుని 6న పట్టాలు పంపిణీ చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు.

రైతువేదికలు సిద్ధం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దశాబ్ది ఉత్సవాల వేళ 3న రైతుదినోత్సవం నిర్వహణకు రైతువేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంతోష్ తెలిపారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేటలోని రైతువేదికను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెరిగిన సాగు విస్తీర్ణం, వినూత్న పంటల సాగు వివరాలు, రైతు నికర ఆదాయం పెరుగుదల, సాగునీటి సరఫరా అంశాలపై రైతులకు వివరించేలా వాల్ పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, ఏడీఏ అనిత, ఏఓ మార్గం రజిత, ఏఈఓ శ్రీనిక పాల్గొన్నారు.

ఉత్సవాలు పండుగలా నిర్వహించాలి

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కన్నుల పండుగలా నిర్వహించాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల విజయవంతంపై నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి కలెక్టర్ సంతోష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన ఫలితాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ఊరూరా జెండాలు ఎగురవేయాలని తెలిపారు. వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మంత్రి సురేఖ, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదంలో బోర్లు దగ్ధం

కౌటాల(సిర్పూర్): మండలంలోని వీరవెల్లి గ్రామ సమీపంలో వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో పక్కనున్న పొలాలకు మంటలు వ్యాపించి కుబిడే హరిదాస్, ఎం.హరికృష్ణ, ఎకోస్కర్ గోపికి చెందిన బోర్లు దగ్ధమయ్యాయి. ఇద్దరు రైతుల వరిగడ్డి కుప్పలు సైతం కాలిపోయాయి. మంటలు వ్యాప్తి చెంది గ్రామ సమీపంలోకి రావడంతో స్థానికులు నీళ్ల చల్లి ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మ్యాదరివాడ సమీపంలో గంజాయి విక్రయించేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 3.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలానికి చెందిన దూపం దిలీప్, కొంక శ్రీనివాస్ మహారాష్ట్ర నుంచి తెచ్చిన గంజాయిని మంచిర్యాలలోని కొందరికి విక్రయించేందుకు వచ్చారు. తమకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ, కేసు నిమిత్తం స్థానిక సీఐ రాజుకు అప్పగించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

ఎన్‌హెచ్ఏఐ పీడీకి ఎన్‌హెచ్ బాధితుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాతీయ రహదారి-63 విస్తరణతో విలువైన భూములు, ఇళ్లు కోల్పోకుండా న్యాయం చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ అజయ్ మణికుమార్‌కు గురువారం ఎన్‌హెచ్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. హాజీపూర్, దొనబండ, ముల్కల్ల, వేంపల్లి గ్రామాలకు చెందిన పలువురు కొత్తగా అలైన్‌మెంట్‌తో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. గోదావరి తీరం వెంట రహదారి విస్తరణ జరిగేలా చూడాలని కోరారు.

‘కవ్వాల్’లో అడవి కుక్కల బెడద

- అభయారణ్యంలో ఏటా పెరుగుతున్న కుక్కల సంఖ్య
- పులినైనా ఎదిరించే సత్తా
- భయంతో అడవిలో కాలుపెట్టేందుకు బెబ్బులి వెనుకడుగు



జన్నారంలో ఇటీవల కెమెరాకు చిక్కిన అడవి కుక్కలు

జన్నారం(ఖానాపూర్): అడవి కుక్కలకు పులులు కూడా భయపడుతాయి. వన్యప్రాణులను హడలెత్తించే బెబ్బులి కూడా అడవికుక్కలను చూసి వెనుదిరుగుతుంది. పులి వేటాడిన జంతువును అడవికుక్కలు లాక్కుపోతాయి. పులికి ఎదురు తిరిగే అడవి కుక్కల సంఖ్య పెరుగుతుండడంతో కవ్వాల్ అభయారణ్యంలో కాలుపెట్టడానికి పులి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. వన్యప్రాణులను భయపెట్టే బెబ్బులి అడవి కుక్కలను చూసి భయపడుతుందా? అంటే అటవీశాఖ అధికారులు నిజమే అంటున్నారు. కొన్నిరోజులు రాకపోకలు కొనసాగించిన పులి ఏడాది కాలంగా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో అడుగు పెట్టడం లేదు.

పులులకు అనువైన ప్రాంతం..

దట్టమైన అటవీ ప్రాంతం.. రకరకాల వన్యప్రాణులు.. పులి ఉండేందుకు అనువైన ఆవాసాలు.. జలపాతాలు.. కలబోసిన కవ్వాల్ అడవులు. ఈ అడవులు పులులకు అనువుగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్ మాసంలో కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. టైగర్‌జోన్ అడవులను 892.23 స్క్వేర్ కిలోమీటర్ల కోర్ ఏరియా, 123.12 స్క్వేర్ కిలోమీటర్ల బఫర్ ఏరియాగా గుర్తించారు. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సమీపంలో మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్‌జోన్ ఉంటాయి. ఆయా టైగర్‌జోన్లలో పులుల సంఖ్య ఎక్కువ కావడంతో కవ్వాల్ టైగర్ జోన్‌లోకి ప్రవేశించే అవకాశాలున్నాయి. పులులకు అనువైన ప్రాంతంగా, ఇక్కడ పదికి పైగా పులులకు సరిపడా వన్యప్రాణులు, ఆవాసాలు ఉన్నందువల్ల ఇక్కడికి పులులు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

టైగర్‌జోన్‌లో 240 వరకు అడవి కుక్కలు

పులికి ఎదురు తిరిగే అడవి కుక్కలు అడవిలో ఎక్కువగా ఉండడం కూడా పులి రాకపోవడానికి ఒక కారణమని చెప్పవచ్చు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డుల ప్రకారం సుమారుగా 240 వరకు అడవి కుక్కలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో సుమారుగా 120 వరకు అడవి కుక్కలున్నట్లు తెలుస్తోంది. 10 నుంచి 12 వరకు గ్రూపుగా ఉంటూ దాడికి దిగుతాయని, ఇలాంటి గ్రూపులు జన్నారం డివిజన్‌లో 10 వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులి ఇక్కడ ఉండక పోవడానికి అడవి కుక్కల బెడద కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చంటున్నారు.

ఎదురు తిరిగే సత్తా

వన్యమృగాల్లో ఒకటైన అడవి కుక్కలకు ఏ జంతువుపైన అయినా ఎదురు తిరిగే సత్తా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. జింకలు, నీలుగాయి, సాంబర్లు, చిరుత, పులి, ఎలుగుబంటి వంటి వన్యమృగాలపై కూడా అడవికుక్కలు గుంపులుగా దాడికి పాల్పడుతాయి. అందుకే అడవి కుక్కల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట పులులు, చిరుతలు ఉండవని అధికారులు చెబుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో దట్టమైన అడవులు, లోయలు ఎన్నో ఉన్నాయి. వీటిలోనే చిరుతలు, పులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో కూడా కుక్కలు తిరుగుతూ పులులు వేటాడిన మాంసాన్ని లాక్కునివెళ్లి తింటాయి. అడవి కుక్కల సంఖ్య మరింత పెరిగితే వన్యప్రాణులకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

అడవి కుక్కల సంఖ్య పెరిగింది



కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం డివిజన్ 12 శాతం మాత్రమే ఉంది. ఇక్కడ పులికి అనువైన ప్రదేశాలున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో ఇటీవల అడవి కుక్కల సంఖ్య పెరిగింది. పులి రాకపోవడానికి అవి కూడా ఒక కారణం కావచ్చు. గతంతో పోలిస్తే డివిజన్‌లో అడవి కుక్కల సంఖ్య రెండు రెట్లు పెరిగినట్లు తెలుస్తోంది.

– సిరిపురం మాధవరావు, ఫారెస్ట్ డివిజనల్ అధికారి

ఆహారశుద్ధి పరిశ్రమలకు రుణాలు

- పీఎం ఎఫ్ఎంఈ పథకం కింద మంజూరు
- నిరుద్యోగులు, చిరు వ్యాపారులకు లబ్ధి

పీఎంఎఫ్ఎంఈ, తెలంగాణ ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ లోగో

పాతమంచిర్యాల: నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకాన్ని ప్రవేశపెట్టింది. నిరుద్యోగులు, చిరువ్యాపారులు లబ్ధి పొందేలా తెలంగాణ రాష్ట్ర ఫుడ్‌ప్రాసెసింగ్ సొసైటీ, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థలు సంయుక్తంగా జిల్లాలోని ఔత్సాహికులు ఆహారశుద్ధి కేంద్రాలు స్థాపించుకోవడానికి బ్యాంకుల ద్వారా 35 శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తోంది. బేకరీ ఉత్పత్తులు, ఫ్లోర్‌మిల్లులు, మినీ రైస్ మిల్లులు, బియ్యం, పాలు, పాల ఉత్పత్తులు, కూరగాయలు, చింతపండు, టోమాటో జ్యూస్‌లు, కెచప్‌లు, ఐస్‌క్రీం, కుల్ఫి, పాపడ్, స్వీట్, మిల్లెట్ ఉత్పత్తులు, పౌల్ట్రి, తేనె, బెల్లం తయారీ, సుగంధ ద్రవ్యాలు, చెరుకు, నూనె గింజల ఆధారిత ఉత్పత్తుల యూనిట్లకు రాయితీపై రుణాలు అందించనున్నారు. ప్రతి సంవత్సరం 200 యూనిట్లు స్థాపించడమే లక్ష్యంగా జిల్లా పరిశ్రమల శాఖ ఔత్సాహికులకు రుణసహాయం అందజేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వృత్తి నైపుణ్యాలు అవసరం లేదని, మామూలుగా ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నవారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్రం డీఆర్‌పీ రాఘవేందర్ తెలిపారు.

మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములుగా..

ఈ ఏడాది ప్రత్యేకంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో రుణాల మంజూరు కోసం జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. మహిళా సంఘాల సభ్యులు సైతం కొత్త యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం లేదా పాతయూనిట్‌ల అభివృద్ధి కోసం రుణాలు మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా జిల్లా పరిశ్రమల అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వాటిని జిల్లా పరిశ్రమల అధికారులు, రిసోర్స్ పర్సన్‌లు పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఒక్కో యూనిట్ విలువ రూ.10 లక్షలుకాగా జిల్లా వ్యాప్తంగా 578 యూనిట్‌లు స్థాపించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 470 దరఖాస్తులను స్వీకరించగా 102 యూనిట్లను మంజూరు చేశారు. 63 యూనిట్లు గ్రౌండింగ్ చేశారు.

ఆహారశుద్ధిరంగం బలోపేతం..

ఆహారశుద్ధి పరిశ్రమలు స్థాపించుకున్న వారికి సాంకేతిక సహాయంతో పాటు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి ఆహార ఉత్పత్తులు పెంచడానికి మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాలు ఇస్తున్నాం. ఆహారశుద్ధి రంగాన్ని బలోపేతం చేయడానికి ఇప్పటికే ఆహార ఉత్పత్తులు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు యూనిట్లు అభివృద్ధి చేసుకోవడానికి సబ్సిడీ రుణాలు ఇస్తున్నాం.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

త్వరలోనే గోలేటి ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న గోలేటి ఓసీపీలో అతి త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కైరిగూడ ఓసీపీ మేలో 3.3 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికిగానూ 3.4 లక్షల టన్నులతో 101 శాతం ఉత్పత్తి సాధించామన్నారు. 3.97 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 7.38 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేశామన్నారు. ఏప్రిల్‌తో పోల్చితే మేలో 14 వేల టన్నులు అధికంగా సాధించామన్నారు. వట్టివాగు నాలా సెకండ్ డైవర్షన్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రూ.13 కోట్లతో గోలేటి సీహెచ్‌పీకి రెండో లూప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి’

మంచిర్యాలటౌన్: పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మహాజన్ సంపర్క్ కార్యక్రమంపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లాలో మూడు సభలు, 250 ఎంపీటీసీ, వార్డు కౌన్సిలర్ల పరిధిలోని ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వెయ్యి మంది ముఖ్యమైన వ్యక్తులతో సమావేశాలు, సోషల్ మీడియాలో ప్రభావితం చేసే వ్యక్తులతో సమావేశాలు, ప్రతీ ఇంటికి మోదీ సాధించిన విజయాలు, యోగా దినోత్సవం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిలో చంద్రాపూర్-మంచిర్యాల జాతీయ రహదారి పూర్తికాగా, మంచిర్యాల-విజయవాడ, మంచిర్యాల-ఆర్మూర్ జాతీయ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారన్నారు. రంగారావు, పురుషోత్తం, రజనీష్ జైన్, వెంకటేశ్వర్‌రావు, తుల ఆంజనేయులు, మల్లికార్జున్, హరికృష్ణ, మాడిపెల్లి సత్యం, పచ్చ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏబీపీపీ ఆధ్వర్యంలో గ్రూప్స్ స్టడీ సర్కిల్

శ్రీరాంపూర్(మంచిర్యాల): అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ(ఏబీపీపీ) ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కొత్త రోడ్డులోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రూప్స్ స్టడీ సర్కిల్‌ను గురువారం ఏబీపీపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్టడీ సర్కిల్ గ్రూప్స్ పరీక్షలు అయ్యే వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు గ్రూప్స్ స్టడీ బుక్స్, స్టడీ చైర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు వెల్మరెడ్డి శివారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి ఎల్పుల రవీందర్, గురుస్వాములు కొండ శ్రీనివాస్, బేతి అనంత సాయిరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బుక్య భీమ్, తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న తిరుమల్‌రావు

‘కుమ్మరి యువతకు బీసీబంధు ఇవ్వాలి’

జన్నారం(ఖానాపూర్): కుమ్మరి యువతకు బీసీబంధు కింద ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగుడు భూమన్న డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుమ్మరి యువకులు ఉద్యోగాలు రాక, కుమ్మరి పని చేయలేక నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కుమ్మరి కుల వృత్తి భారంగా మారిందన్నారు. కుమ్మరి కుల వృత్తిని కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీ రామానంద తీర్థ శిక్షణ కేంద్రంలో యువకులకు శిక్షణ ఇప్పించి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని, 50 సంవత్సరాలు నిండిన కుమ్మరులకు ఆసరా పింఛన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో కోడూరి సత్తన్న, అంజన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమ్మరి సంఘం నాయకులు

9న రెండో విడత గొర్రెల పంపిణీ



మాట్లాడుతున్న కొమ్ము అశోక్

కోటపల్లి(చెన్నూర్): జిల్లాలో ఈ నెల 9న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు గొర్రెలు మేకల వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు. గురువారం బోరంపల్లిలో యాదవులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ కుటుంబాలు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉడుత రాజబాపును నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజాగౌడ్, నాయకులు శేఖర్, సంతోశ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి

- ఇంటిహద్దు వివాదంలో ఘటన



గాయపడిన బుచ్చమ్మ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఇంటి హద్దు వివాదంలో మహిళపై గొడ్డలితో దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని గుడిపేటలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. హాజీపూర్ మండలం గుడిపేటలోని దుబ్బగూడెంకు చెందిన గోళ్ల శంకరయ్య, గోళ్ల లక్ష్మీనారాయణ అన్నదమ్ములు. కొంత కాలంగా ఇరువురి ఇంటి మధ్య హద్దుగోడ నిర్మాణం వివాదస్పదంగా మారింది. గురువారం ఇరువురి ఇంటి మధ్య హద్దుల మేరకు గోళ్ల శంకరయ్య హద్దుగోడ నిర్మాణం ప్రారంభించాడు. ఇష్టారాజ్యంగా కడుతున్నారంటూ లక్ష్మీనారాయణ వాగ్వాదానికి దిగాడు. శంకరయ్య భార్య బుచ్చమ్మ కూడా తన భర్తపైకి ఎందుకు గొడవకు దిగుతున్నావంటూ మందలించడంతో కోపోద్రిక్తుడైన లక్ష్మీనారాయణ ఒక్కసారిగా పక్కనే ఉన్న గొడ్డలితో బుచ్చమ్మపై దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యంకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుచ్చమ్మ భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

13న గుర్తింపు ఎన్నికలపై సమావేశం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న నిర్వహించనున్న సమావేశానికి కార్మిక సంఘాల నాయకులు హాజరు కావాలని రిటర్నింగ్ అధికారి, డెప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డీ.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపించడంలో జాప్యం చేస్తున్నారని కొన్ని సంఘాలు గతంలో హైకోర్టులో కేసు వేశాయి. దీనిపై హైకోర్టు ఈ ఏడాది మార్చి 23న ఇచ్చిన తీర్పు మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని డెప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగనుందని, ఎన్నికలకు సంబంధించి ఇందులో కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో గోల్డ్‌మెడల్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్-13, 15 సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పాల్గొన్న జిల్లా కేంద్రానికి చెందిన గుర్రాల మన్స్యుత్ ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించాడు. త్వరలో బిహార్, ఒరిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని నిర్వాహకులు తెలిపారు.



గుర్రాల మన్స్యుత్

‘ఆశ్రమ’ సీఆర్టీలకు తీపి కబురు

- 12నెలల వేతనానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 1,126 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న సీఆర్టీలు

ఉమ్మడి జిల్లా సీఆర్టీల వివరాలు

జిల్లా	సీఆర్టీల సంఖ్య
నిర్మల్	143
ఆదిలాబాద్	450
మంచిర్యాల	103
కుమురంభీం	430



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లకు (సీఆర్‌టీ) రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటికే ఇతర శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల పెంపు వంటి ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం, ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలకు కూడా ఏడాది కాలంపాటు పూర్తి వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 1,126 మందికి ప్రయోజనం కలుగనుంది.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు రెసిడిన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచారు. సీఆర్‌టీల వేతనం కూడా పెంచి నెలకు ఎస్జీటీలకు రూ.21,255, స్కూల్ అసిస్టెంట్లకు రూ.28,977 అందజేస్తున్నారు. ఒక విద్యా సంవత్సరంలో ఏప్రిల్‌లోని చివరి పనిదినం వరకు అనగా పదిన్నర నెలలు మాత్రమే వీరికి వేతనం అందించే వారు. వేసవి సెలవుల్లో వేతనం ఇచ్చేవారు కాదు. వేసవి సెలవుల్లో కూడా తమకు వేతనం అందజేయాలని సీఆర్‌టీలు గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వీరి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం 12 నెలల వేతనం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం 2022-23 విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లాలో 160మంది సీఆర్‌టీలకు ప్రయోజనం..

నిర్మల్ జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 17 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్ టీచర్లతో పాటు 143 మంది సీఆర్‌టీలు పని చేస్తున్నారు. వీరిలో 60 మంది ఎస్జీటీలు, 83మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గత విద్యా సంవత్సరం (2022-23) నుంచి వీరందరికీ 12 నెలల వేతనం అందనుంది. ప్రభుత్వ నిర్ణయంపై సీఆర్‌టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, రెగ్యులరైజ్ చేయాలని సీఆర్‌టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



సీఆర్‌టీలకు పదిన్నర నెలల వేతనం కాకుండా ఏడాది కాలానికి పూర్తి వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాం. మా విజ్ఞప్తులకు సానుకూలంగా ప్రభుత్వం స్పందించి సముచిత నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. సీఆర్‌టీలు గత 20ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. మా ఉద్యోగాలనూ రెగ్యులరైజ్ చేస్తే సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మునినాయక్, జిల్లా ఆశ్రమ పాఠశాలల, సీఆర్టీల సంఘం అధ్యక్షుడు, నిర్మల్

12 నెలల వేతనం హర్షణీయం



రెండు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ పేరుతో విధుల్లో చేరిన వీరంతా 20ఏళ్లుగా బోధన చేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తరువాత ఎన్నోసార్లు పలు పద్ధతుల్లో ప్రభుత్వానికి విన్నవించుకుంటూ వస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం 12నెలల వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ అధ్యక్షుడు